
ప్రజాశక్తి
శనివారం 10 మే 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





కందుకూరులో వరుస చోరీలు

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరులో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తుతున్నారు. ఇటీవల వాసవి నగరంలో జరిగిన దొంగతనాలు మరవకముందే పట్టణంలోని వాసవి గ్రంథాలయం వీధిలోని పసుపులేటి రాజేశ్వరి ఇంట్లో గురువారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. ఇంటి యజమాని రాజేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సింగరాయకొండలో ఉన్న తన కూతురి వద్దకు వెళ్లడం జరిగిందని శుక్రవారం ఉదయం ఇంటి ఎదురుగా ఉన్న వారు మీ ఇంటిలో దొంగలు పడ్డారని ఫోన్ చేయడం జరిగింది. ఇంటికి రావడం జరిగిందని తీరా చూస్తే ఇంటిలో ఉన్న బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయని, అందులో ఉన్న పది సవర్ల బంగారం, పదివేల రూపాయల నగదు, వెండి పట్టీలు పోయినట్లుగా తెలుసుకున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. కందుకూరు నాదరమ్మకాలనీలో గురువారం రాత్రి మరో దొంగతనం జరిగినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కందుకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరును సారా రహిత జిల్లాగా చేద్దాం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరుజిల్లాను సారా రహిత జిల్లాగా కలెక్టర్ ఆనంద్ ప్రకటించారు. శుక్రవారం కలెక్టర్ వారి చాంబర్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నాటుసారా నిర్మూలనకు చేపట్టిన చర్యలను ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలోని కావలి, బుచ్చిరెడ్డిపాలెం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని రెండు మండలాల్లో మొత్తం ఐదు గ్రామాలను నాటుసారా గల గ్రామాలుగా గుర్తించి గత మూడునెలలుగా రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీశాఖల సమన్వయంతో ఎక్సైజ్ అధికారులు నాటుసారా నివారణకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఎక్సైజ్ అధికారులు ముమ్మరంగా నిర్వహించారన్నారు. నాటాసారా వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అర్థమయ్యేలా పోస్టర్లను రూపొందించి చైతన్యం కలిగించినట్లు చెప్పారు. జిల్లాలోని ఐదు గ్రామాలను విడతలవారీగా నాటుసారా రహిత గ్రామాలుగా, రెండు మండలాలను సారారహిత మండలాలుగా గ్రామ,మండలస్థాయిలో తీర్మానించినట్లు చెప్పారు. జిల్లాలో నాటుసారాపై ప్రస్తుత పరిస్థితి సమీక్షించిన కలెక్టర్ జిల్లా నాటుసారా రహిత జిల్లాగా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఇక నుండి జిల్లాలో ఎక్కడా కూడా నాటుసారా తయారీ, సరఫరా, అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని పటిష్ట నిఘా కొనసాగించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య, డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులునాయుడు, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఒ.ఆనంద్

శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ పరిసరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ నెల 17వ తేదీన శనివారం జరగనున్న ఈ జయంతి ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీగా హాజరయ్యే అవకాశమున్నందున, వారి కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. ఈ జయంతి వేడుకలు వైభవంగా, భక్తులందరికీ సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లు ఉండాలి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యానికి ప్రత్యేక చర్యలు ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, శుభ్రత, దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అదనంగా, ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. ఈ పనులు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి సాగర్ బాబు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ అధికార ప్రతినిధి షేక్ రఫీ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ఇంటూరిని కలిసిన 'బెజవాడ'

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల కందుకూరు సీనియర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన బెజవాడ కృష్ణయ్య ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకం చేయడంలో సహకరించిన కందు కూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పండిట్ సంపత్ కుమార్, పి భాస్కర రావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం

దళిత కుటుంబాల జీవనోపాధిని కాపాడండి

ప్రజాశక్తి-నెల్లూరు

ఉడ్ కాంప్లెక్స్ కి పోయే దారిలో పార్కు పక్కన కార్పొరేషన్ పనిచేసుకుంటు 25 సం.రాలుగా జీవిస్తున్న 25 కుటుంబాలను ఉడ్ కాంప్లెక్స్ యజమానులు, ఏపీఐఐసీ అధికారులు కుమ్మక్కై నిరాశ్రయులను చేసిన దానిపై న్యాయం చేయాలని కోరుతూ నెల్లూరు ఆర్డీఒకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు ఎస్ రఘునాధయ్య, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలు నుంచి 25 దళిత కుటుంబాలు ఏపీఐఐసీ పార్కు గోడను అనుకొని బెంచీలు, స్టూళ్లు, కట్టిపీటలు లాంటి కొయ్య వస్తువులు తయారు చేసుకొని అమ్ముకుంటూ వారి పిల్లలను చదివించుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఇటీవల ఉడ్ కాంప్లెక్స్ యజమానులు రోడ్డు పక్కన డ్రెయినేజీ కాలువ నిర్మించే నెపంతో ఏపీఐఐసీ అధికారులతో కుమ్మక్కై, వీరందరినీ అక్కడి నుంచి తొలగించి రోడ్డున పడేశారన్నారు. దీంతో వారు తమ జీవనోపాధిని పూర్తిగా కోల్పోయారని పక్కనే ఉన్న పార్కులో చెట్లకింద ఉంటున్నప్పటికీ అక్కడ కూడా ఉండ నీయ కుండా తరిమి వేయడంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని అన్నారు. వెంటనే వారికి ఏపీఐఐసీ పార్కు గోడ పక్కనే బొంకులను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించి వారి జీవనోపాధిని కాపాడాలని నెల్లూరు ఆర్డీఒను కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొండా. ప్రసాద్, దేవతతి సంపత్, మన్నెం వెంకటేశ్వర్లు, మన్నెం తిరుపతయ్య, బుద్దుల శివకృష్ణ, బుద్దుల సురేష్, బుద్దుల శివ, బుద్దుల ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, బాధితులు

పకడ్బందీగా ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

ప్రజాశక్తి-నెల్లూరు +జిల్లాలో ఈనెల 12 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయభాస్కర్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ చాంబర్‌లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు రెండవ సంవత్సరం వారికి పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 28 నుండి జూన్ 1 వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 24,835 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, అందుకోసం మొత్తం 65 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగే విధంగా, ప్రథమచికిత్స కేంద్రాలను ఏర్పాటుచేయాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలో తగినంత తాగు నీటి వసతి సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా బస్సులను నడపాలని సూచించారు. అదేవిధంగా పరీక్షల నిర్వహణకు అనువుగా కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ (నెంబర్: 0861 – 2320312) ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐఒ వర ప్రసాద్ రావు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మధుబాబు, మున్సిపల్, విద్యుత్, వైద్య, ఆర్ టి సి అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం



లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి 15వ తేదీ కందుకూరు నియోజకవర్గం వచ్చిన సందర్భంగా దూబగుంట నుంచి కోవూరు గ్రామం వరకు రోడ్డు నిర్మాణం కొరకు 80 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని, అదేవిధంగా గ్రామీణ రహదారి పనుల కొరకు నాబార్డ్ నిధులు ద్వారా 3 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కేవలం సంక్షేమ కాదు అభివద్ధి చేసి చూపించేందుకు కూడా కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 160బి హైవేపై ప్రమాదల నివారణకు కందుకూరు పోలీస్ శాఖ అధికారులు, ఆర్‌టిఒ , హైవే అధికారులతో మాట్లాడటం జరిగిందని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసేందుకు చర్యలను తీసుకో వాలని సూచించడం జరిగిందని తెలిపారు. పేద ప్రజల పాలిట ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాకుండా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సహాయం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మీ కుటుంబానికి ఆసరాగా ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తున్న మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నియోజకవర్గ బాధిత కుటుంబాలు తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాలరావు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అన్న దాత సుఖీభవ


ప్రజాశక్తి-కందుకూరు

అన్నదాత సుఖీభవ పథకానికి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలయ్యాయని కందుకూరు వ్యవసాయ సంచాలకులు పి అనసూయ తెలిపారు. సంవత్సరానికి ఒక రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14000 కేంద్ర ప్రభుత్వం తరపున రూ.6000 చొప్పున మొత్తం 20 వేల రూపాయలు సాగు ఖర్చులకు జమ చేయడం జరుగుతుందన్నారు.. రైతు సేవ కేంద్రాలలో దీనికి సంబంధించిన డేటా వెరిఫికేషన్ ఈనెల 20వ తేదీ వరకు ఆన్లైన్లో అన్నదాత సుఖీభవ పోర్టల్ లో రైతు సేవ కేంద్రం సహాయకులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఈ విధంగా ఉన్నాయన్నారు. ఒక సంస్థకు సంబంధించిన భూములు రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అనగా జిల్లా పరిషత్ చైర్మన్ లు, మేయర్లు ,ఎమ్మెల్యేలు ,ఎంపీలు ఎమ్మెల్సీలు మొదలైనవారు ,ఉద్యోగస్తులు, రిటైర్ అయిన ఉద్యోగస్తులు పదివేల పైన పెన్షన్ తీసుకునేవారు (నాలుగవ తరగతి ఉద్యోగస్తులు) తప్ప, ఆదాయ పన్ను చెల్లించువారు, పట్టా రిజిస్టర్ చేసుకుని ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు, ఇంజనీర్లు న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్స్ ఆర్కిటెక్స్ నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ హౌస్ సైట్స్ గా కన్వర్ట్ అయినా రైతుల భూములు ఒకవేళ రెవెన్యూ రికార్డులో అప్డేట్ అయినా కాకపోయినా ఈ అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులు అవుతారు. వ్యవ వ్యవసాయ, ఉద్యాన సెరికల్చర్ లో సాగు భూమి ఉన్న ప్రతి రైతు ఈ పథకానికి అర్హులవుతారు. ఈ డేటా వెరిఫికేషన్ గ్రామస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ డేటా వెరిఫికేషన్ తరువాత పోర్టల్ లో డేటా రీ వాల్యు డేట్ అవుతుంది. ఫైనల్ లిస్టు మరలా గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సహాయకులకు వస్తుందన్నారు. వారు ఫేషియల్ ఈ కేవైసీ ద్వారా ఆయా రైతులను మరలా నమోదు చేసినట్లయితే వారు చివరకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారు. కావున ప్రతి రైతు తమ ఆధార్, భూమి వివరాలతో మీ మండల పరిధిలోని రైతు సేవా కేంద్ర సహాయకులను కలిసి వివరములను పరిశీలించుకోవాలని పి అనసూయ కోరారు.



కంప్యూటర్లు బహూకరణ

ప్రజాశక్తి-కందుకూరు: వెనకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేస్తున్న విర్కో ఫౌండేషన్ చైర్మన్ నారాయణరెడ్డి కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గతంలో డొనేట్ చేసిన దాదాపు రూ.10 లక్షల విలువైన 15 ఆధునిక డెస్క్ టాప్ కంప్యూటర్లు మెరుగ్గా పని చేయుటకు దోహదపడే విధంగా దాదాపు రూ. 90,000 విలువ చేసే యుపిఎస్ , ఎక్సైడ్ బ్యాట రీలను అందించడం జరిగింది. విద్యార్థుల నైపుణ్యాభి వృద్ధి కొరకు వీటిని వాడాలని వారు సూచించారు.సమాజంలోని మూడు రంగాలలో– ఆరోగ్యం, విద్య ,మౌలిక సదుపాయాల కల్పన విషయాలలో ప్రగతిని సాధించడానికి గాను ఈ సంస్థ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో కృషి చేస్తోంది. కేన్సర్ బారిన పడుతున్న తక్కువ ఆదాయ కుటుంబాల పిల్లలకు, వారి కుటుంబాలకు రవాణా సదుపాయం, ఆహారం, వసతి సౌకర్యాలతో కూడిన వైద్యాన్ని అందించే బృహత్తర ప్రాజెక్టును నిర్వహిస్తోంది. అన్ని రకాల కేన్సర్ పేషెంట్లకు మంచి వైద్యం అందిస్తున్నారు. 2023వ సంవత్సరంలో 1566 డయాలసిస్ లు, ఈ సెంటర్స్‌లో నిర్వహించబడ్డాయి. వారి జీవితాల్ని నిలబెట్టడమే కాక ఆ పేషెంట్స్‌కి కావలసిన అన్ని సదుపాయాలను వారు ఏర్పాటు చేస్తూ, పూర్తి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. విర్కో ఫౌండేషన్ అందిస్తున్న సేవలలో ఉన్నతమైన మరొక సేవ విద్యాపరమైన సేవ. పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు మంచి విద్యను అందించడానికి వివిధ రకాల సేవలను ప్రారంభించింది విర్కో ఫౌండేషన్. అందులో భాగంగానే టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కూడా బ్యాటరీలను ఫౌండేషన్ అందించడం చాలా సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.. ఈ సాయం అందించడంలో తోడ్పాటు అందించినవారు నారాయణ రెడ్డి మిత్రులు కొండేపి శ్రీరామ చంద్ర రావు, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఇప్పగుంట మల్లికార్జున రావు శిష్యులు. ఈ సౌకర్యాలను కళాశాల విద్యార్థినీ విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదలకు మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.





గుడ్లూరురూరల్‌లో

బాలికల వికాసంపై అవగాహన

ప్రజాశక్తి- గుడ్లూరు రూరల్

కిశోర వికాసం వేసవికాలంలో సెలవులు కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు మండలంలోని తేట్టు సెక్టార్ లో అంగన్‌వాడీ సెంటర్లో జరిగింది. బాలికల గురించి చిన్న వయసులో వివాహాలు చేసుకోవడం వలన వచ్చే ఇబ్బందులు అలాగే చిన్న వయసులో వివాహం చేసుకున్న వెంటనే గర్భిణీ కావడం వలన వచ్చే సమస్యలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కామేశ్వరి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేసుకుంటే పుట్టే పిల్లలు కూడా అనారోగ్యంతో పుడతారని తల్లీ బిడ్డ ప్రాణానికి కూడా ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని ఆ సమయంలో వచ్చే ఆరోగ్య సమస్యలు దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలు మారతాయన్నారు. పుట్టే పిల్లలు కూడా అనారోగ్యంతో బాధపడతారని 19 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేసుకోవాలని .లేకుంటే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్రవంతి. ఆశ వర్కర్ మంజుల, అంగన్వాడీ కార్యకర్త ప్రసన్న పాల్గొన్నారు.



కందుకూరులో

ప్రజాశక్తి–కందుకూరు

కందుకూరు మండలం, పందలపాడు గ్రామ సచివాలయం పరిధిలోని రెండవ అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం ' కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో భాగంగా బాల్య వివాహలు వాటి వలన కలిగే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి పందాలపాడు గ్రామ సర్పంచ్ కె పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు గుండ్ల గిరిజ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని తెలిపారు.బాల్య వివాహం యువ తల్లులకు, ముఖ్యంగా గర్భధారణ ప్రారంభంలో వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. బాల్య వివాహం వలన జరిగే ప్రమాదాలను వివరించారు. కుటుంబాలు బాల్య వివాహాన్ని ఆర్థిక భారాలను తగ్గించడానికి లేదా ఆర్థిక స్థిరత్వాన్ని పొందేందుకు ఒక మార్గంగా చూడవచ్చు.కట్నం , వధువు ధర: వరకట్నం లేదా వధువు ధర ఆచారం బాల్య వివాహాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి స్కూల్ హెడ్ మాస్టర్ వి. బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి స్వప్న, అంగన్వాడీ టీచర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లూరు

గుడ్లూరు లోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో 25 మంది గర్భిణులకు వైద్యాధికారిణి ఎల్ సాయి ప్రియాంక ప్రత్యేక వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు గర్భిణులలో హాయ్ రిస్క్ లో ఉన్న నలుగురికి రక్తహీనత లోపం తగ్గించడానికి ఐరన్ మాత్రలు అందజేశారు. గర్భిణులు నిరంతరం పౌష్టికాహారం సేవించాలని వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు తెలియజేశారు.



పగలే వెన్నెలాయే..

ప్రజాశక్తి-సైదాపురం: మండలంలోని సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలోని సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో గిద్దలూరు, తలుపూరు, ఒరుపల్లి, కలిచెడు,తురిమెర్ల, గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతుంది.ఫలితంగా విద్యుత్ శాఖ గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





చాంబర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఒ.ఆనంద్

పేదల గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి -నెల్లూరు :జిల్లాలో పేదల గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ వారి చాంబర్లో ఎన్‌టిఆర్ హౌసింగ్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణ దశలను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆప్షన్ – 3 కింద లబ్ధిదారులకు కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను ఇంజినీరింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నల్ల రేగడి నేలల్లో నిర్మిస్తున్న ఇళ్ల పునాదుల నాణ్యతను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి సర్టిఫై చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు లేని ఇళ్లను ముందుగానే గుర్తించి పునాదులను దృఢంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని ఇళ్ల నిర్మాణాలు పటిష్టంగా నిర్మించా లన్నారు. నాణ్యత ప్రమాణాలు పరిశీలించేందుకు ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. పీఎంఏవై ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నూతన ఇళ్లు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖల ఎస్ఇలు గంగాధర్, వెంకటరమణ, విజయన్, అశోక్ కుమార్, డిఇలు జహీరుద్దీన్, నారాయణరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నెల్లూరు

మేడే సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ నగర్ లోని ఎస్.వి. జి.ఎస్ కళాశాల గ్రౌండ్లో ఉత్సాహభరిత వాతావరణంలో క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను నెల్లూరు నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని భారంతో జీవిస్తున్న ఆటో కార్మికుల్లో మానసి కోల్లాసం కలిగించేందుకు సిఐటియు నాయకులు కృషి చేయడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొంటున్న కార్మికులందరూ స్నేహపూరిత వాతావరణంలో ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు.సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఏ శ్రీనివాసులు, జి నాగేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో జీవించే కార్మికులకు మానసికోల్లాసాన్ని కలిగించేందుకు మేడే సాంస్కృతికోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్ అమలు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు, యాజమాన్యాలకు అనుకూలంగా రూపొందించిన లేబర్ కోడ్స్ కారణంగా కార్మికులు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో అన్ని రంగాల్లోని కార్మికులను ఐక్యం చేసేందుకు, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం చేసేందుకు, కార్మికులు మానసిక ఒత్తిడిని జయించి ఉల్లాసంగా జీవించేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, క్రికెట్, కోలాటం, ఆటపాటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్న కార్మికులందరికీ ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కత్తి శ్రీనివాసులు, పి సూర్యనారాయణ, ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్, నగర కార్యదర్శి పి మురళి, రవీంద్ర,బాబు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు పెంచలయ్య, నాయకులు మురళి, బాబు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న దృశ్యం

వైసీపీ ప్రభుత్వంలో వందల కోట్లు స్వాహా

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్ పనులు చేయకుండానే చేసినట్లు చూపి వందల కోట్లు స్వాహా చేశారని సర్వేపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. మండలంలోని ముంగలదొరువు వద్ద కోడూరు కాలువ మరమ్మతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ రెండో పంటకు సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఐఎబి సమావేశం లో తీర్మానించడం జరిగిందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు ఒక లక్ష ఎకరాల్లో పంట సాగు జరుగుతుందని భావిస్తున్నటు తెలిపారు. సోమశిల జలాశయంలో ప్రస్తుతం 50 టీఎంసీల నీటి నిల్వ ఉందని, తాగునీటి అవసరాలు, డెడ్ స్టోరేజీ పోను 35 టీఎంసీలు నికరంగా నీటి నిల్వ ఉంటుందన్నారు. సర్వేపల్లి, కనిగిరి రిజర్వాయర్లలోనూ అదనంగా నీళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కొందరు రైతులు రెండో పంట సాగు కు ఆసక్తి చూపుతున్నా రన్నారు. ఎవరు పంట పెట్టినా నీటిని పొదుపుగా వాడుకోవాలని, .ఒక్క చుక్క నీటిని కూడా వృథా చేయొద్దని సూచించారు. 2023 రెండో పంట సీజన్ లో 1.05 లక్షల ఎకరాలకు 41 టీఎంసీల నీటిని వాడేశారన్నారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ పనులు చేయకుండానే చేసినట్లు చూపి వందల కోట్లు స్వాహా చేశారని విమర్శిం చారు. వైసీపీ పాలన నాటి పరిస్థితులను ఈ ప్రభుత్వంలో పునరావృతం కాకూడదని చెప్పారు. కాలువలను బాగు పడుతున్నాయని, ఈ నేపథ్యంలో నీటిని పొదు పుగా వాడుకోవాలని సూచించారు. ఆరు తడులతో పంట దిగుబడి పెంచుకునే అంశాన్ని పరిశీలించాలన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు.కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మన్నెం జితేంద్ర గౌడ్, చింతా సీతారా మయ్య, రైతులు, నీటి పారుదల శాఖ అధికారులు, తాసిల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులకు గురైన కాలువను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి

బాలికల వికాసంపై అవగాహన



ప్రజాశక్తి-మర్రిపాడు : మర్రిపాడు సెక్టార్‌లోని మర్రిపాడు మిక్సిడ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరీ బాలికా వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ రాధ పాల్గొని మాట్లాడుతూ కిషోరీ బాలిక వికాస్ ప్రధాన ఉద్దేశం కిషోరీ వ్యక్తిత్వ అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సామాజిక స్థాయిలో భాగస్వామ్యాన్ని పెంచడమని తెలిపారు. బాలికలు ఆరోగ్యం, పోషకాహారం, లైఫ్ స్కిల్స్ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన నిరోధక చట్టం, చిన్న వయస్సులో పెళ్లి చేసుకుంటే కలిగే అనర్థాలు, బాలికలు ఆరోగ్య పరీక్షలు, శరీరకంగా వచ్చే మార్పుల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు చంద్రకళ, శాంతమ్మ, బాలికలున్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో వేసవి సెలవులు పురస్కరించుకొని కిశోరీ బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.జయలక్ష్మి మాట్లాడుతూ చిన్నతనంలోనే వివాహాలు చేయడం వల్ల, ఆమె గర్భం దాల్చిన సమయంలో అటు తల్లికి ఇటు బిడ్డకు అది ప్రమాదకరమని, ఒక్కో సందర్భంలో తల్లీబిడ్డ మరణించే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం మరియు ఎంఎల్‌హెచ్‌పి (ఎస్) వి.విజిత, పి.హెచ్. ఎస్.రాజా సులోచన దేవి, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : బాల్య వివాహాలు చేయడమనేది చట్టరీత్యా నేరమని, ఆడపిల్లకు 18 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని అట్లు కాక బాల్య వివాహాలు చేస్తే వంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల తెలిపారు. కోవూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇనమడుగు సెక్టర్ మోడేగుంట పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై కిశోర బాలికలు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, మునికుమారి, తదితరులు ఉన్నారు.

రైతులకు పైపులు పంపిణీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కొండమీద కొండూరు గ్రామపంచాయతీకి సంబంధించిన గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో ఎస్‌ఎంఎఎస్, ఎఫ్.ఎస్.ఎస్. పలసెస్ పథకం 2024 -25 కింద మొత్తం 19 మంది రైతులకు ఒక్కొక్క యూనిట్‌కు రూ.15 వేల సబ్సిడీతో 19 యూనిట్లు పీవీసీ పైపులను, అత్యధిక సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ, మండల వ్యవసాయ అధికారి టి.రజిని ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.సాయినాథ్, గ్రామములోని లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని అనుముసముద్రం గ్రామంలో శుక్రవారం సీతారాముల కళ్యాణం మహోత్సవం సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమంతో తిరునాళ్ల మొదలైంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ శుక్రవారం రోజు ధ్వజారోహణంతో మొదలయ్యి సాయంత్రం హనుమంత సేవ గ్రామోత్సవం జరుగుతుందని, శనివారం గరుడ సేవ ఉత్సవము, ఆదివారం సీతారాముల కళ్యాణం తదుపరి వసంతోత్సవం, అదే రోజు పారువేట నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా ప్రతిరోజు కల్చరల్ ప్రోగ్రామ్, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియ జేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ కాలనీవాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మహా యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు గర్భిణీలకు కిట్లు పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం చైర్ పర్సన్ మోర్ల సుప్రజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ దొడ్ల కోదండరామి రెడ్డితో కలిసి ఆమె గర్భిణీలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు చెందిన డాక్టర్ పద్మజ, కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానవత్వపు బాటలో నడుద్దాం..

ప్రజాశక్తి-కావలి : రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకులు సర్ జీన్ హెన్రీ డునాంట్ చూపిన మానవత్వపు బాటలో పయనిద్దాం అని కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షులు, ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాలను ఆర్‌డిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్.బెజవాడ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్‌డిఒ వంశీకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఖాజీ డాక్టర్ ముక్తి ఖలీల్ అహ్మద్, మరొక అతిథి ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు వీరాస్వామి, డాక్టర్ రవికుమార్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్ మాట్లాడారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కె.హరినాథ రెడ్డి, కోశాధికారి అరికట్ల మధుసూదన్ రావు, పాలకమండలి సభ్యులు డాక్టర్ పి.శేఖర్, ఇలింద్ర శ్రీవాణి, అంతిసెట్టి రమేష్ రెడ్డి, మోడదన నరసింహారావు, గొట్టిపాటి మనోహర, ప్రదీప్, సాయికుమార్, పోషక సభ్యులు డాక్టర్ అల్లం శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘం నాయకులు కట్టా రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలి

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ, వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద గర్భిణులకు, బాలింతలకు వైద్య శిబిరం నిర్వహించారు. పి.హెచ్.ఎస్. డాక్టర్ యం.మహేష్, డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ వారు కళ్యాణం ఐరన్ పోలిక్ సిరప్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ డాక్టర్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త యం.మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్ ఎ.ఎన్.ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను రైతులకు శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి పుట్టా సత్యవాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి మాట్లాడుతూ రైతులందరూ 50శాతం రాయితీపై ఇచ్చిన వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బోగోలు మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి లక్కాకుల మాధవరావు, సీనియర్ నాయకులు ఎన్నా బత్తిన వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ నాగరాజు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అలఘునాథస్వామి కళ్యాణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అలఘునాథ స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవదేవతలను విశేషంగా అలంకరించి అనంతరం కళ్యాణాన్ని నిర్వహించారు. అంతకు ముందుగా అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు, అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విడవలూరు : మైనారిటీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ నరేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మైనారిటీ అనగా ముస్లిం, సిక్కు, బుద్ధిస్ట్, జైనులు, పార్సీ కులానికి చెందిన వయస్సు 21 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల లోపు కలిగి ఉండి, దారిద్య్ర రేఖ దిగువ (బి.పి.ఎల్) వర్గానికి చెంది ఉండాలని అర్హులైన అభ్యర్థుల నుండి 2025-2026 సంవత్సరానికి గాను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. అర్హులైన మైనారిటీ అభ్యర్థులు స్వయం ఉపాధిపై రుణాలు పొందేందుకు మే 25వ తేదీ చివరితేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు చేసుకునేందుకు 25వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపిడిఒ శ్రీహరి తెలిపారు. అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటితో గడువు పూర్తి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎస్‌సి కార్పొరేషన్ నుండి లోన్లు పొందేవారు శనివారంతో ఆన్‌లైన్ దరఖాస్తులు ముగుస్తున్నట్లు ఎంపిడిఒ ఎ.వాణి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ రుణాలకు అర్హులైన ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. శనివారం సాయంత్రంలోగా కంప్యూటర్ సెంటర్లో సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం..

- కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు



సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ వి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడీదారుల ప్రయోజనాల కోసం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, అందులో భాగంగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలు చేయాలని చూస్తుందని, ఈ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే ప్రయత్నంలో భాగంగా 20వ తేదీన కార్మిక సంఘాలన్నీ కలిసి చేస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు నిచ్చింది. శుక్రవారం నగరంలోని టౌన్ హాల్‌లో జిల్లాకు చెందిన కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిన్ని రాజగోపాల్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు రాంబాబు, ఎఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు పి.యానాదయ్య, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు వై.మల్లికార్జునరెడ్డి, వైఎస్ఆర్ టియు జిల్లా నాయకులు జయకుమార్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముందుగా ఇటీవల జమ్మూ కాశ్మీర్ ప్రాంతం సమీపంలోని పహల్గాం ప్రాంతంలో చోటు చేసుకున్న ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటిస్తూ నిమిషం పాటు మౌనం వహించి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గత నెల 25వ తేదిన విజయవాడలో జరిగిన రాష్ట్ర సదస్సులో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు అందజేయాలని రాష్ట్ర, కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానం చేశాయని గుర్తు చేశారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సదస్సులు, జాతాలు నిర్వహించుకుంటున్నామన్నారు. దేశ వ్యాప్తి సమ్మెకు సంబంధించిన డిమాండ్లు ఏవైతే ఉన్నాయో వాటిని కార్మికులందరికీ వివరించి విజయ వంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయన్నారు. అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సంపాదించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లుగా మార్పు చేస్తూ కరోనా సమయంలో ప్రజలందరూ తమ ప్రాణాలను అరిచేతిలో పట్టుకొని ఉన్న సమయంలో పార్లమెంట్‌లో ఎటువంటి చర్చలు నిర్వహించకుండా ఆమోదింపచేసుకుందన్నారు. కేంద్రంలోని కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటాలు, ఉద్యమాల వల్ల ఈ లేబర్ కోడ్‌లు అమలు చేసే విధంగా కేంద్రం నోటిపై చేయలేదన్నారు. ఎన్నికల అయిన తరువాత కేంద్రంలో టిడిపి, జెడియు సభ్యుల సహకారంతో లేబర్ కోడ్లను నోటిఫై చేసేందుకు అవసరమైన చర్యలను వడివడిగా చేస్తుందన్నారు. దానికి వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు 20వ తేదిన దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చాయన్నారు. ఈ లేబర్ కోడ్‌లకు పరిశీలిస్తే కార్మికుడికి ప్రయోజనం చేకూరే విధంమైన అంశాలు లేవని, కేవలం యాజమాన్యాలకు ప్రయోజనం చేకూరే విధంగా మాత్రమే ఉన్నాయన్నారు. వారి లాభాలు పెంచేందుకు మాత్రమే ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం అందజేయాలని చెబుతూనే జాతీయ కనీస వేతనం కంటే తక్కువ ఇవ్వడానికి వీలు లేదని చెబుతుందన్నారు. జాతీయ కనీస వేతనం అంటే ఒక్క రోజుకు వేతనం రూ.178 మాత్రమే అని నెలకు రూ.5వేలు మాత్రమే అన్నారు. కనీస వేతనం అమలు చేయాలని కార్మిక చట్టాలు ఒకవక్క చెబుతుంటే చాలా వరకు యాజమాన్యాలు ఈ చట్టాన్ని అమలు చేస్తున్న దాఖలాలు లేవన్నారు. లాభాలతో సంబంధం లేకుండా కనీస బోనస్ కార్మికులకు అందజేయాలని, లాభాలు వస్తే 20 శాతం బోనస్‌గా అందజేయాల్సి ఉందన్నారు. అటువంటి దానికి నష్టం చేకూరే విధమైన చర్యలు ఈ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అసంఘటిత రంగంలో కోట్లాది మంది కార్మికులు జీవిస్తున్నారని, వారు భవన నిర్మాణ రంగం, ఆటో కార్మికులు, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్టు రంగంలో కార్మికులు, దుకాణాల్లో పనిచేసే కార్మికులు, ఇటువంటి వారు ఎంతో మంది సంక్షేమానికి యాజమాన్యాలు చెల్లించే సెస్ అందజేయాల్సి ఉందన్నారు. ఇటువంటి చర్యలన్నింటికీ కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. కాంట్రాక్టు రంగంలో పని చేస్తున్న కార్మికులు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశాలు ఇలే అనేక మంది ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు స్కీమ్ వర్కర్లు అందరూ కార్మికులుగా గుర్తించాలని వీరందరికీ కనీస వేతనం అందజేయాలని తీర్పునిచ్చిందన్నారు. ఈ తీర్పును కేంద్రం అమలు చేసిన దాఖలాలు లేవాన్నరు. కార్మికులందరినీ కట్టు బానిసలుగా తయారు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తయారు చేసింద న్నారు. 8 గంటల పనివిధానానికి కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చేసిందన్నారు. 12, 14 గంటలు కార్మికులు పనిచేసే విధంగా ఈ కోడ్‌లు ఉన్నాయన్నారు. ఈ చర్యలన్నింటినీ కార్మిక వర్గం ప్రతిఘటించకపోతే భవిష్యత్తులో ఉద్యోగ భద్రత, ఉపాధి భద్రతలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. మెడికల్ రెప్సకు సంబంధించిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్టు, వర్కింగ్ జర్నలిస్టు యాక్టు,మైనింగ్ యాక్టు,రవాణా రంగానికి సంబంధించిన యాక్టు ఇలా 29 రకాల చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితమైన ఆలోచనలు చేస్తుందన్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఉగ్రవాద చర్యలను కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ స్వలాభం కోసం వాడుకుంటుందన్నారు. రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోని 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, మేధావులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు సిఎస్ సాగర్, ఎఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్ బాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు సంజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు చంద్ర రాజ గోపాల్, గంగపట్నం రమణయ్య, వైఎస్ఆర్ టియు రాష్ట్ర నాయకులు ఎం.రాజేష్‌కుమార్, పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు ఎం.ఆర్ రెడ్డి, ఎపి ఫారెస్టు డిపార్టమెంట్ రాష్ట్ర నాయకులు బి.సుధాకర్, బిఎస్ఎన్ఎల్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఎఎస్‌పేట ఎస్ఐ ఎ.సైదులు సూచనలతో యాత్ర స్థలమైన ఎఎస్‌పేటలో భక్తుల ముసుగులో సంఘ విద్రోహక శక్తులు ఎవరైనా వస్తారేమోనన్న అనుమానంతో ఎఎస్‌పేటకు వచ్చే ప్రతి వాహనాన్ని అర్ధరాత్రి సమయంలో కూడా స్థానిక పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే స్థానికంగా ఉన్న లాడ్జీలలో రికార్డులను తనిఖీలు నిర్వహించి, లాడ్జీల్లో ఉన్న యాత్రికుల వివరాలు వారి ఆధార్ కార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ రమేష్ పోలీస్ సిబ్బంది పవన్ కుమార్, షబ్బీర్, జావిద్, ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కన్నబాబు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం, చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనుల పరిశీలనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆత్మకూరు నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీ కన్నబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కన్నబాబును ఆప్యాయంగా పలకరించారు.


నేడు డయల్ యువర్ 'ఆర్‌టిసి డిఎం'

ప్రజాశక్తి-కావలి



శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు 9959225643 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని, వీలైన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు. గత డయల్ యువర్ డియం కార్యక్రమాల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అన్నింటిని పరిష్కరించామని ఆయన వివరించారు. కావున తమ డిపో పరిధిలోని కావలి, జలదంకి, కలిగిరి, బోగోలు, కొండాపురం, దగదర్తి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

టిడిపిలో అచ్యుత్ రెడ్డి చేరిక



ప్రజాశక్తి-విడవలూరు : వైసిపి జిల్లా రైతు సంఘ అధ్యక్షులు పూండ్ల అచ్యుత్ రెడ్డి ఆ పార్టీ వీడి ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలో శుక్రవారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. విడవలూరు, రామతీర్థం, గాజులదిన్నె, రామచంద్రాపురం, రామతీర్థం, వావిళ్ళ, దండిగుంట, దంపూరు తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేందర్ రెడ్డి, దండిగుంట సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ, విడవలూరు సర్పంచ్ యాటగిరి ప్రవీణ్, మాజీ ఎంపిటిసి కొమ్మిరెడ్డి మురళి రెడ్డి, చౌకిచర్ల మాజీ సర్పంచ్ అళగిరి వినోద్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు ఏనేటి ప్రసాద్, రామతీర్థం ఆలయ మాజీ ఛైర్మెన్ నాటారు చంద్రయ్య, అలగానిపాడు ఎంపిటిసి చింతాడి జగన్మోహన్, మాజీ ఉప సర్పంచ్ పొన్నం సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ వెంకటరమణ, వీరారెడ్డి పల్లి ఉప సర్పంచ్, గౌడ సంఘం అధ్యక్షులు కోసూరు రవిలతో పాటు విడవలూరు మండల వైసిపి సీనియర్ నాయకులు నిమ్మల రవీంద్ర, మౌలాలి, పొన్నపూడి తాతారావు, కాటం శీనయ్య, ఆవుల సుధీర్, కంది మునిస్వామి, కంది వేణు చేబ్రోలు జనార్ధన్ తదితర నాయకులను పేరు పేరునా స్వాగతం పలుకుతూ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పసుపు కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఇది వ్యక్తులకు సంబంధించిన మార్పు కాదని చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మాత్రమే ఈ రాష్టం బాగుపడుతుందన్న ప్రజలలో వస్తున్న మార్పుకు సంకేతమన్నారు. ఈ సందర్భంగా అభివృద్దే టిడిపి నినాదం, సంక్షేమమే చంద్రబాబు నాయుడు విధానమన్నారు. వేమిరెడ్డి దంపతుల అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై టిడిపిలో చేరామని పూండ్ల అచ్యుత్ రెడ్డి అన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేస్తున్న అభివృద్ధి, పార్టీలకతీతంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి ఆకర్షితులమై టిడిపిలో చేరుతున్నట్టు ప్రటించారు.



విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్య పడుతుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం 2025 పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు నిర్మలా దేవి ఫౌండేషన్, బీమ్స్ భారత్ సైనిక్స్ ఆధ్వర్యంలో మండలంలోని డేవిస్‌పేట పగవారిపాలెంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ విచ్చేసి విద్యార్థులకు మోమెంటోలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత ఉత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో లలిత మహేశ్వర ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేశ్వర స్వామి, తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంఇఒ సునీల్, ప్రసాద్ రెడ్డి, తన్నీరు మధు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలో రాబోయే 4యేళ్లలో కనీసం 5వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించడమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. శుక్రవారం సాయంత్రం భగత్ సింగ్ కాలనీలో పర్యటించిన మంత్రి నారాయణకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అపరిష్కృతంగా ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించిన మంత్రి నారాయణకు బ్రహ్మరథం పట్టి, పూల వర్షం కురిపించారు. తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ఇంటి పట్టాలకు క్యాబినెట్లో గ్రీన్ సిగ్నల్ ఇప్పించిన మంత్రికి ప్రతి గడపలోనూ మంగళ హారతులతో స్వాగతం పలికారు. భగత్ సింగ్ కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి మంత్రి నారాయణ పట్టాలు ఇస్తున్నామని శుభవార్త చెప్పారు. 1400 కుటుంబాలలో వెలుగులు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు. భగత్ సింగ్ కాలనీవాసుల సమస్యకు పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న మహిళలు

'ప్రజా వేదిక'తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-వరికుంటపాడు

రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 38మంది అర్జీలను సమర్పించారు. నోషనల్ ఖాతాలు, అసైన్మెంట్ పట్టాలకు సంబంధించి అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు హేమంత్ కుమార్ తెలిపారు. ఈ వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు. వచ్చే నెలలో కూడా ఈ సమస్యలు పరిష్కరించేందుకు మరొక తప్ప ఇటువంటి ప్రజావేదికను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. జెడ్‌పిటిసి నాగేంద్ర, ఇఒపిఆర్‌డి నాగురువల్లి, ఎస్ఐ ఎం.రఘునాథ్,తదితరులున్నారు.



మాట నిలబెటుకున్న 'వైసిపి'

ప్రజాశక్తి-బిట్రగుంట



ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం వైసిపి ది అని ఆ పార్టీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు అన్నారు. శుక్రవారం బిట్రగుంటలోని వైసిపి కార్యాలయంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ మధ్యబోయిన రఘు, విశ్వనాథరావుపేట ఎంపిటిసి ఎకె సుందర్ రాజ్, యువత నాయకులు దేవరకొండ వరుణ్ తేజ మాట్లాడుతూ వైసిపి పాలనలో అరాచక పాలన చేశారని, బయటకి వస్తే కేసు పెట్టడం, కార్యకర్తలను వేధించారని, టిడిపి మండల కన్వీనర్ మాలపాటి నాగేశ్వరరావు విలేకరుల సమావేశాన్ని పెట్టి మాట్లాడారని గత ప్రభుత్వంలో మీరు ఎన్ని ధర్నాలు, పోరాటాలు చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీరు చెట్టు పనులు చేసుకున్నామా.. మనం అభివృద్ధి చెందామా.. అన్న ధ్యాసే తప్ప వేరొకటి లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో తెలపాలని కోరారు. ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేక ప్రతిపక్షాలపై చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్త అయినా బర్నర్నును బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా పార్టీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పత్రి అంకులయ్యా, తుమ్మల రమణయ్య, తోటపల్లి సాగర్, శ్రీనివాసులు, కళ్యాణ్, నాయబ్ రసూల్, పాపారావు, ఆవుల సురేష్, కిరణ్, చిన్ని, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుని జయంతి

ప్రజాశక్తి-కావలి : కావలి రెడ్ క్రాస్ ప్రాంగణం లో రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు సర్ జాన్ హెన్రీ డ్యూ నాంట్ జయంతి సందర్భంగా రెడ్‌క్రాస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సభ్యత్వ నమోదులో భాగంగా కావలి పట్టణ జనజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అత్యధికంగా 93 సభ్యత్వాలు నమోదు చేసి, లక్ష్యాన్ని సాధించినందుకు రెడ్ క్రాస్ అధ్యక్షులు కావలి ఆర్.డి.ఒ. ఎం.సన్నీ వంశీకృష్ణ, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ బెజవాడ. రవి కుమార్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డాకారపు. రవి ప్రకాష్, డాక్టర్ ముక్తి ఎమ్‌డి ఖలీల్ అహ్మద్, శ్రీ బచ్చు వీరాస్వామి చేతులమీదుగా ప్రతిభా పురస్కార్ అవార్డు అందుకున్నారు. ఈ సంద ర్భంగా సన్మాన గ్రహీత తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు లభించిన ఈ సన్మానం రెడ్‌క్రాస్‌పై మరింత బాధ్యతను గుర్తు చేస్తుం దని, రెడ్‌క్రాస్ బాధ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



ఎంఎల్ఎ చొరవతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణంలోని యూనియన్ రోడ్డులో నివాసం ఉంటున్న 15 మోచి ఎస్‌సి కులస్తుల కుటుంబాలు ఉన్నారు. 2013 నుండి రెవెన్యూ శాఖ ఆ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను నిలిపివేశారు. అప్పటి నుండి ఆ కులస్తులకు సంబంధించిన వారి చదువులకు, సంక్షేమ పథకాలకు కుల ధృవీకరణ లేక 10యేళ్ల నుండి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై ఎంఎల్ఎ కాకర్ల సురేష్ దృష్టికి తీసుకుని వెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. దాంతో రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, ఎంఎల్ఎ కాకర్ల సురేష్ రెవెన్యూ శాఖ ఉన్నత అధికారులకు ఆ కుటుంబాలు ధన్యవాదాలు తెలిపారు.

1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1) (సి) ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని బుచ్చిరెడ్డిపాలెం మండల విద్యాశాఖ అధికారి ఎం దిలీప్ కుమార్ శుక్రవారం ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25శాతం సీట్లు 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్ల కోసం ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా ఈనెల 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బలహీనవర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ, ఓసి కుటుంబాలు గ్రామీణ ప్రాంతంలో 1,20,000 పట్టణ ప్రాంతంలో 1,44000 మించకుండా ఆదాయం కలిగిన వారు అర్హులని తెలిపారు. సిబిఎస్ఇ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 2, 2019 నుండి మార్చి 31, 2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు వయసు నిండి ఉండాలన్నారు. అదేవిధంగా స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం జూన్ 2,2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండి ఉండాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం బుచ్చిరెడ్డిపాలెం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలి



ప్రజాశక్తి-ఉదయగిరి : నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నూతనంగా చేపడుతున్న ఎంపిడిఒ కార్యాలయం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ డి.ఇ. సిహెచ్.మణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గుత్తేదారులు చేపడుతున్న నిర్మాణ పనులను ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతితో పరిశీలించి గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. వస్తున్న వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు పనులు పూర్తయ్యేలా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆదినారాయణ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : చెన్నకేశవ స్వామి ఆశీస్సులతో నీడు ముసలి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండలంలోని నిడుముసలి గ్రామంలో చెన్నకేశ్వర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి విగ్రహాలకు ఎంఎల్ఎ ప్రత్యేక అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నబోయిన చెంచుకిషోర్ బాబు, దువ్వూరు మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ దువ్వూరు పవని రెడ్డి, చిరమణ జనార్దన్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.